క్లుప్తంగా

నులకపేటలో బాలఏసు చర్చి ప్రారంభోత్సవం

- ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి నులకపేటలో బుధవారం బాలఏసు చర్చి ప్రారంభోత్సవాన్ని కమిటీ సభ్యులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మురుగుడు లావణ్యకు బిషప్ చిన్నాబత్తుని భాగ్యయ్య ఆశీస్సులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, జేసీఎస్ జిల్లా సమన్వయకర్త ఈదులమూడి డేవిడ్ రాజు, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటుకు నోటు కేసులో చంద్రబాబుకు శిక్ష తప్పదు



మంగళగిరి : ఓటుకు నోటు కేసులో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు శిక్ష తప్పదని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) స్పష్టం చేశారు. ఓటుకు నోటు కేసులో నిందితునిగా చేర్చడంతో పాటు మరో రెండు కేసులు ఈనెల 18న విచారణకు రానున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఆర్కే ఈ విషయాన్ని గుర్తు చేశారు. ఓటుకు నోటు కేసును సీబీఐకి బదిలీ చేయాలంటూ ఓ కేసు, ఇదే కేసులో బాబును ముద్దాయిగా చేర్చాలంటూ మరో పిటిషన్ వేయగా సుప్రీంకోర్టు విచారణ నిమిత్తం అనుమతించిందన్నారు. అదే విధంగా జెరూసలం మత్తయ్య, సెబాస్టియన్‌లను విచారణ చేయకూడదనే మరో రెండు కేసులు విచారణకు వస్తున్నాయన్నారు. చంద్రబాబు డబ్బు సంచులతో మేనేజ్ చేయడంతో పాటు ఏడేళ్ల పాటు కేసుల్ని వాయిదాలు వేయించడం సిగ్గుచేటన్నారు. న్యాయస్థానాలను తప్పుదోవపట్టిస్తూ వాయిదాలు కోరడాన్ని చూస్తుంటే జాలేస్తుందన్నారు. ఓటుకు కోట్లు ఇస్తూ దొరికిన దొంగ ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి కాగా దాన్ని ప్రోత్సహించిన మరో నాయకుడు మరో రాష్ట్రానికి సీఎం కావాలని విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పెద్దమనుషుల ముసుగులో ప్రజల్లో తిరుగుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ఇప్పటికైనా చంద్రబాబు కేసులో న్యాయవ్యవస్థ సరైన తీర్పునిచ్చి, చంద్రబాబుకు శిక్ష విధించేలా చూస్తుందని ఎమ్మెల్యే ఆర్కే ఆశాబావం వ్యక్తం చేశారు.

కమనీయం..రమణీయం..రాములోరి కల్యాణం

వాడవాడలా..నవమి వేడుకలు

తాడేపల్లిరూరల్ : శ్రీరామనవమి సందర్భంగా జానకీ వల్లభుల పరిణయోత్సవం వాడవాడలా వేడుకగా జరిగింది. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణం, గ్రామీణ ప్రాంతాలతో పాటు దుగ్గిరాల మండలంలోని పలు పల్లెల్లో బుధవారం నవమి వేడుకలు అశేష భక్తజనవాహిని నడుమ అంగరంగ వైభవంగా సాగాయి. ఎటుచూసినా రామ నామ ఘోష మారుమోగింది.పలు రామాలయాల్లో అన్న దాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఆధ్యాత్మిక పరవశంలో...అశేష జనవాహిని

సీతానగరం విజయవాడ ఇంద్రకీలాద్రి దత్తత దేవాలయమైన శ్రీకోదండసమేత శ్రీరామాంజనేయస్వామి దేవస్థానంలో కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు ఆధ్వర్యంలో శ్రీనివాసాచార్యులు దుర్గగుడి నుంచి స్వామివారికి వచ్చిన పట్టు వస్త్రాలను అలంకరించి కల్యాణ హోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్ర దేవదాయ కమిషనర్ శ్రీరామసత్యనారాయణ దంపతులు విచ్చేసి పట్టువస్త్రాలు సమర్పించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం సీతారాములకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సత్యకుమార్ ఆచార్యులు, ప్రకాష్ శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు. అటు సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఉదయం 9.30 గంటలకు సీతారామ కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు జీయర్ విద్యా సంస్థల ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు తెలిపారు.

ఇస్కాన్ దేవస్థానంలో...



ప్రత్యేక పూజలు చేస్తున్న మచిలీపట్నం పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్

ఉండవల్లి అమరావతి కరకట్ట ప్రాంతంలోని ఇస్కాన్ దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. 25 మంది దంపతులతో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. ఉదయం 4.30 గంటలకు హారతితో ప్రారంభమైన వేడుకలకు భక్తులు వేలాదిగా తరలి వచ్చి సీతారాముల పరిణయాన్ని తిలకించారు. అనంతరం కీర్తనలు, భజనలు, ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు.

భజన గీతాలు..భక్తి ప్రవచనాలు..అన్నదానాలు

శ్రీరామనవమి సందర్భంగా పలు దేవాలయాల పరిధిలో ఆధ్యాత్మిక వాతావరణం చోటుచేసుకుంది.



ఫిరంగిపురంలో సీతారాముల కళ్యాణం



అంగరంగ వైభవం...జానకీ వల్లభుల పరిణయ మహోత్సవం



సీతారాములకు పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న దేవదాయ కమిషనర్ శ్రీరామ సత్యనారాయణ దంపతులు



సీతారాములకు తలంబ్రాలు పోస్తున్న విజయ కీలాద్రి అర్చకులు

భజన గీతాలు, భక్తి ప్రవచనాలతో ఆలయాలు మారుమోగాయి. వీటితో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వాహకులు చేపట్టారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం ఆంజనేయస్వామి దేవస్థానం, ఎన్టీఆర్ కరకట్ట, సలాం సెంటర్ రామాలయం, మహాలక్ష్మి చెట్టు వద్ద, గౌడ కళ్యాణ మండపం, మహానాడు, నులకపేట, బ్రహ్మానందపురం తదితర ప్రాంతాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. మహానాడులో మాజీ ఎంపీటీసీ గోగుల శ్రీను ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెనుమాకలోని విష్ణు దేవాలయంతో పాటు పలు రామాలయాలు, ఉండవల్లి రెడ్డు రామ మందిరం వద్ద అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. నాయుడు బజారు, ఉండవల్లి లొద్ది ఆంజనేయ స్వామి దేవస్థానం వద్ద కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. కుంచనపల్లి, పాతూరు, చిర్రావూరు, గుండిమెడ, వడ్డేశ్వరం, కొలనుకొండ, ఇప్పటం, రాధారంగా నగర్‌లో ఆయా కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

దుగ్గిరాల....

దుగ్గిరాల మండల పరిధిలోని వీర్లపాలెంలో శ్రీరామకోవెలలో అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం నిర్వహించారు. దేవస్థానంలో అఖండ జ్యోతిని వెలిగించి సీతారాముల చిత్ర పటం, అక్షింతలతో గ్రామస్తులు సాంప్రదాయ బద్ధంగా గ్రామోత్సవం నిర్వహించారు. దుగ్గిరాల, చింతలపూడి, పెనుమూలి, కంఠంరాజు కొండూరు, ఈమని, మంచికలపూడి, పెదపాలెం, పెదకొండూరు, చుక్కవల్లివారి పాలెం, చిలువూరు, చినపాలెం, గొడవర్రు, శృంగారపురం, రేవేంద్రపాడు, తుమ్మడిపూడి, వీర్లపాలెం, పెరుకలపూడి ప్రాంతాల్లో కళ్యాణ మహోత్సవాన్ని రమణీయంగా, కమనీయంగా నిర్వహించారు.



కళ్యాణమహోత్సవంలో భక్తులు

అన్నదానం చేపట్టారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు బాణావత్ కుషీభాయి, ఉన్నం ఝాన్సీ, ఇత్తడి రమేశ్, శ్రీనివాసరెడ్డి, గంపల గంగాధర్, పలువురు ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాడవాడలా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

తాడికొండ: శ్రీ రామనవమి పర్వదినం వేళ తాడికొండ, తుళ్ళూరు మండలాల్లోని పలు గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తాడికొండ రావిచెట్టు కేంద్రంలోని రెడ్ల రామాలయంలో జరిగిన వేడుకల్లో మచిలీపట్నం పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరవడంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

నేత్రపర్వం...జానకీ వల్లభుల పరిణయం



తుళ్ళూరు రామాలయంలో సీతారాముల కళ్యాణం

ఫిరంగిపురం: శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల ఆలయాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహించారు. ఫిరంగిపురంలోని సీతారామస్వామి ఆలయం వద్ద ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో అర్చకులు రాజేంద్రశర్మ, హౌస్‌గణేశునిపాడు రామ మందిరంలో వంశీకృష్ణ, రేపూడిలోని కోదండ రామాలయం వద్ద కృష్ణమూర్తి కళ్యాణ వేడుక నిర్వహించారు. తక్కెళ్లపాడులోని కోదండరామస్వామి ఆలయం, రేగులగడ్డ రామాలయంతో పాటు పొనుగుపాడులోని ఆంజనేయస్వామి గుడిలో పండితులు వేడుకలను వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, పానకం అందజేశారు. ఆయా ఆలయాల ఆవరణలో తాటాకు పందిళ్లు వేసి శోభాయమానంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు.



దుగ్గిరాల మండలం వీర్లపాలెంలో శ్రీరామ నవమి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రామాలయంలో లావణ్య ప్రత్యేక పూజలు



సీతానగరం కోదండ రామ దేవస్థానం ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య



తాడేపల్లి శ్రీ కోదండ సీతారామాద్యంలో అక్షింతలతో లావణ్యను ఆశీర్వదిస్తున్న అర్చకులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలో పలు రామాలయాల్లో బుధవారం నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాల్లో మంగళగిరి వైఎస్సార్సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల పార్టీ నాయకులతో కలసి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సీతానగరం శ్రీ కోదండ రామ సమేత శ్రీ మత్ రామాంజనేస్వామి దేవస్థానం, తాడేపల్లి కొత్తూరు శ్రీ కోదండ సీతారామాలయం, దాసాంజనేయస్వామి దేవస్థానంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, గుంటూరు జిల్లా జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్ రాజు, పార్టీ నాయకులు కళ్ళం రాజశేఖర్‌రెడ్డి, గారుగు శ్రీనివాస్ రెడ్డి, మేకా అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేను లోకల్.. లోకేశ్ నాన్ లోకల్

- ప్రజలకు విజ్ఞప్తి చేస్తోన్న మురుగుడు లావణ్య
- వినూత్న శైలితో వడివడిగా ప్రచారంలోకి...



బాప్టిస్ట్‌పేట ప్రచారంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య

మంగళగిరి : నేను లోకల్...నారా లోకేశ్ నాన్ లోకల్. మాలో ఎవరు గెలిస్తే అందుబాటులో ఉంటారు? ఎవరికి నియోజకవర్గంపై పూర్తి స్థాయిలో అవగాహన ఉందో ప్రజలే తెలుసుకోవాలంటూ వైఎస్సార్సీపీ మంగళగిరి అభ్యర్థి మురుగుడు లావణ్య ప్రజలను అభ్యర్థిస్తున్నారు. తనదైన శైలితో ప్రచారపర్వంలో అడుగులు ముందుకేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం పట్టణంలోని 15 వ వార్డు బాప్టిస్ట్‌పేటలో ప్రచారం చేపట్టారు. తొలుత బాప్టిస్ట్‌పేట చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఫాస్టర్ల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, మాజీ ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ ప్రచారంలో ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందన్నారు. స్థానిక మహిళలు హారతులతో ఘనస్వాగతం పలకడం అభినందనీయమన్నారు. స్థానిక మహిళ అయిన లావణ్య విజయానికి సమష్టిగా కృషి చేస్తున్నామన్నారు. టీడీపీ అభ్యర్థి నారా లోకేష్ గెలిస్తే ఆయన్ను పట్టుకోవడం తమవల్ల కాదని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటినుంచే వాపోతున్నారన్నారు. లావణ్య విజయం తథ్యమని స్పష్టం చేశారు. మాజీ కౌన్సిలర్ కలకోటి స్వరూపారాణి, నాయకులు జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేశ్, జక్సీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, నాయకులు కలకోటి బోయేజు, నందిగం వసంతరావు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా ఓటు అడిగే హక్కు మనకే ఉంది

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికీ అధికారం కల్పించారు
- 90 హామీలతో టీడీపీ ప్రజల్ని మభ్యపెడుతోంది
- ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలి
- ఫ్యాన్ గుర్తుపై ఓటేసి మురుగుడు లావణ్యను గెలిపించండి
- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు విజ్ఞప్తి

తాడేపల్లి రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలతో ప్రతి పేద వర్గానికి సంక్షేమ పథకాలను పారదర్శకతతో అందించారని, ఎన్నడూ జరగని విధంగా అభివృద్ధి చేశారని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు వ్యాఖ్యానించారు. ఇవే కారణాలతో వైఎస్సార్సీపీ తరఫున పోటీ చేసే అభ్యర్థులకు ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లి ఓటడిగే హక్కు ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీకి ఇలాంటి ప్రాతిపదిక ఏమీ లేనందునే 90 హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. వైఎస్సార్సీపీ గుంటూరు జిల్లా పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్యలను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు కృషి చేయాలని మురుగుడు హనుమంతరావు పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి పార్టీ కన్వీనర్ దంటుగోవర్ధన్ రెడ్డి, బాలాజీ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల నిర్వహించిన విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై



విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

ఆనాడు మంగళగిరిని ఎందుకొదిలేశారు?

2014–2019 మధ్య కాలంలో టీడీపీ అధికారంలో ఉండేదని, నారా లోకేశ్ మంత్రిగా ఉన్నప్పటికీ మంగళగిరిని ఎందుకు గాలికొదిలేశారని మురుగుడు ప్రశ్నించారు. ఉండవల్లిలో నివాసముంటూ, అధికారంలో ఉన్నన్నాళ్లూ నియోజకవర్గ ప్రజల కష్టసుఖాలను ఎందుకు పట్టించుకోలేదన్నారు. కరోనా సమయంలో వీరి జాడ ఏమైందని నిలదీశారు. మహమ్మారి కాలంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు జగనన్న సైనికులైన వలంటీర్లు ప్రజలకు సేవ చేస్తుంటే, వీరంతా ఇతర రాష్ట్రాలలో తలదాచుకున్నారని విమర్శించారు. ఈ విషయంలో మంగళగిరి నియోజకవర్గ ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. అధికారంలో వున్నపుడు రాజధాని అభివృద్ధికి అడ్డు అంటూ ఇక్కడి నివాసాలను తొలగించాలని ప్రయత్నించారని, అప్పట్లో ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తల పోరాటంతో వాటిని అడ్డుకోవడం జరిగిందని మురుగుడు గుర్తు చేశారు. ఇప్పుడు అవే నివాసాలకు చట్టబద్ధం చేసి పట్టాలు ఇస్తామంటూ టీడీపీ నాయకులు హామీ ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉండవల్లి, పెనుమాక ప్రాంతాల్లో ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇవ్వలేదని అనధికారికంగా జోన్‌లు ఏర్పాటు చేసి రైతులను ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ప్రత్యేక జీవో తీసుకువచ్చి జోన్‌లు తొలగించారని అన్నారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా జేసీఎస్ సమన్వయకర్త ఈదులమూడి డేవిడ్ రాజు, నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానంద రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ అనిల్, వైఎస్సార్సీపీ నాయకులు సుకుమార్, కోక సత్యనారాయణ, నిర్మలత, కళ్ళం సాంబిరెడ్డి, మున్నంగి శ్రీధర్‌రెడ్డి, మేకల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో స్పీడ్ పెంచిన వైఎస్సార్ సీపీ

- ప్రాంతాల వారీ పర్యటిస్తున్న పార్టీ శ్రేణులు
- ప్రచారంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఇతర నాయకులు

తాడేపల్లిరూరల్ : ఎన్నికలు సమీపిస్తోన్న వేళ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఆ పార్టీ శ్రేణులు ప్రజల్లోకి జోరుగా చొచ్చుకుపోతున్నారు. తమ అభ్యర్థులను గెలిపించేందుకు పార్టీ ప్రజా ప్రతినిధులతో పాటు నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, అమూల్యమైన ఓటును ఫ్యాను గుర్తుపై వేయాలంటూ ప్రజలను అభ్యర్థిస్తున్నారు. గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్యలను అత్యధిక మెజారిటితో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈమేరకు బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని 9,10,14 వార్డులతో పాటు మహానాడు, సుందరయ్యనగర్, ఆర్ఎంఎస్ కాలనీ తదితర ప్రాంతాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. డోలాస్‌నగర్ తొమ్మిది, పదో వార్డులో మాజీ కౌన్సిలర్లు మాచర్ల అబ్బు, స్నేహ సంధ్య, పార్టీ నాయకులు సుబ్బు ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం జరిగింది. ఇందులో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, జిల్లా జేసీఎస్ సమన్వయకర్త ఈదులమూడి డేవిడ్ రాజు, కళ్ళం రాజ, గాలయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో అందిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ ప్రచారం చేపట్టారు. 14వ వార్డు ఆర్ఎంఎస్ కాలనీలో మాజీ కౌన్సిలర్, మైనార్టీ నాయకులు ఎండీ గోరె, తాడేపల్లి ఎస్సీ సెల్ ముదిగొండ ప్రకాష్, మహానాడులో భూపతి కిశోర్ నాయుడు, అప్పికట్ల సంపూర్ణ పార్వతి, సీతానగరంలో బాలసాని అనిల్, బత్తుల దాసు తదితరుల ఆధ్వర్యంలో ప్రచార నిర్వహించారు. ఫ్యాను గుర్తుకు ఓటెయ్యాలంటూ ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బేతం భాస్కర్, బత్తుల వెంకటేశ్వరరావు, రవీంద్ర, ఆయూబ్, నారాయణ, పల్లెం పాలు, వేముల ఆంజనేయులు, మేడిపల్లి మణికుమార్, కె.వంశీ, మద్ది కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



డోలాస్‌నగర్ 9వ వార్డులో ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

టీడీపీ, జనసేనకు షాకిస్తూ..హస్తానికి చెయ్యిస్తూ

- తెలుగుదేశం, జనసేన, కాంగ్రెస్ పార్టీలను వీడిన మైనార్టీలు
- కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి మహానాడులో తెలుగుదేశం, జనసేన, కాంగ్రెస్ పార్టీలకు మైనారిటీలు భారీ షాక్ ఇచ్చారు. బుధవారం మంగళగిరి వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య ఆధ్వర్యంలో పార్టీలో చేరడంతో కండువా కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మురుగుడు లావణ్య మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి మైనారిటీల సంక్షేమానికి కృషి చేశారని, అదే బాటలో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు.రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చూసేందుకు ప్రజలు ఆత్రంగా ఎదురుచూస్తున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి మంగళగిరి నియోజక వర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని, అలాంటి ఆర్కేను కాదని బీసీ మహిళ అయిన తనకు మంగళగిరి సీటు కేటాయించారంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కి సామాజిక న్యాయంపట్ల ఏమేర గౌరవం ఉందో స్పష్టమవుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారం అప్పగించాలనే లక్ష్యం సీఎం జగన్ దన్నారు. బడుగు బలహీనవర్గాల ప్రజలు ఏకతాటిపై నిలిచి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని లావణ్య అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, వైఎస్సార్సీపీ ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, గుంటూరు జిల్లా, పట్టణ జేసీఎస్ కన్వీనర్లు డేవిడ్ రాజు, దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, సోమేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ చిన్నపోతుల దుర్గారావు, గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ మేడా వెంకటేశ్వరరావు (పండు), వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్సీపీలో చేరిన మైనార్టీ నాయకులతో ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య

సుస్థిర పాలన జగన్‌తోనే సాధ్యం

తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి సుచరిత



శాంతిపేటలో ప్రజలతో తాడికొండ వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత

ఫిరంగిపురం: సుస్థిర పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత అన్నారు. మండల కేంద్రంలోని శాంతిపేటలో బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలుకావాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, అందుకు ప్రజలంతా వైఎస్సార్సీపీకి పట్టం కట్టాలని మేకతోటి సుచరిత పిలుపునిచ్చారు. అంతకు ముందు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కె. చిన్నపురెడ్డి, జి. చంద్రం, డి. సురేశ్, చిట్టా అంజిరెడ్డి, పి. జేమ్స్‌ఇన్నయ్య, నన్నం సునీత, పి.జోసఫ్; సయ్యద్ హబీబుల్లా, కె.రామారావు, డి.నరేంద్రకుమార్, కె.థామస్‌రెడ్డి, టి. డేవిడ్, డి.మెలిక్రయా, పి.చిన్నయ్య, బి.శ్రీనివాసరెడ్డి, పి. చిన్న, బి. అంజిరెడ్డి, పిచ్చిరెడ్డి, హేమలతారెడ్డి, టి.సాగర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.